సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 16 । ఏప్రిల్ । 2023



సుస్వరనాదం..
శుభకార్యాల వద్ద తనదైన శైలిలో భర్తతో కలిసి నాదస్వరాన్ని ఆలపిస్తూ ఆకట్టుకుంటున్నారు ద్వారకాతిరుమలకు చెందిన రామతులసి. 8లో ▸



నైపుణ్యాలతో ఉజ్వల భవిష్యత్
విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేవి నైపుణ్యాలేనని ఏపీ నిట్ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ దినేష్ పి.శంకరరెడ్డి అన్నారు. 8లో ▸

కల్యాణం.. కమనీయం
చినవెంకన్న క్షేత్ర ఉపాలయం లక్ష్మీపురంలోని సంతాన వేణుగోపాల జగన్నాథ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసుని దివ్యకల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. 8లో



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆదివారం సాయంత్రం)	సహరి (సోమవారం వేకువజాము)
భీమవరం	6.26	4.24
తాడేపల్లిగూడెం	6.28	4.34
నరసాపురం	6.26	4.23

న్యూస్‌రీల్

ఇళ్ల నిర్మాణాలు వేగిరపర్చాలి



కొండావారిపాలెంలో లేఅవుట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

మొగల్తూరు: ఇళ్ల నిర్మాణాలు వేగిరపర్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. మొగల్తూరు పంచాయతీ కొండావారిపాలెం, కొత్తోట గ్రామాల్లోని జగనన్న లేఅవుట్లను శనివారం ఆమె పరిశీలించారు. కొండావారిపాలెం లేఅవుట్‌లో 39 ఇళ్లకు 18 మంది నిర్మాణాలు చేపట్టకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. కొత్తోట పంచాయతీ చింతరేవులో మెరక పనులు పూర్తయ్యాయని, లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా అవగాహన కల్పించాలన్నారు. ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలన్నారు. సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, గృహనిర్మాణ శాఖ ఇన్‌చార్జి పీడీ బి.పిచ్చయ్య, తహసీల్దార్ జి.అనితాకుమారి, ఎంపీడీఓ ఆర్‌సీ ఆనంద్‌కుమార్, డీఈఈ, ఏఈలు ఉన్నారు.

98 శాతం హాజరు నమోదు



వీరవాసరంలో పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

సాక్షి, భీమవరం: జిల్లావ్యాప్తంగా శనివారం జరిగిన పదో తరగతి సోషల్ పరీక్షకు 121 కేంద్రాల్లో 21,426 మంది హాజరు కావాల్సి ఉండగా 21,006 మంది హాజరయ్యారు. 98 శాతం హాజరు నమోదైంది. ఫ్లయింగ్ స్క్వాడ్స్ 35 కేంద్రాలను, విద్యాశాఖ 5 కేంద్రాలు, ఏసీజీఈ రెండు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేయగా ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ తెలిపారు. ప్రధాన పరీక్షలు పూర్తికాగా 17, 18 తేదీల్లో సంస్కృతం, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి పరీక్షలు జరుగుతాయన్నారు.

లోక్ అదాలత్‌లో ఉద్యోగాలకు నోటిఫికేషన్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కోర్టు పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన శాశ్వత లోక్‌అదాలత్, మీడియేషన్ సెంటర్‌లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగాల భర్తీ కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సి.పురుషోత్తం కుమార్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు డీఎల్ఎస్ఏ కార్యదర్శి జి.రాజేశ్వరి తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక న్యాయ సేవాభవన్‌లో వివరాలను వెల్లడించారు. శాశ్వత లోక్ అదాలత్‌లో హెడ్ క్లర్క్ కేటగిరిలో ఒకటి, స్టెనో కమ్ టైపిస్ట్ కేటగిరిలో ఒకటి, టైపిస్ట్ కమ్ అసిస్టెంట్ కేటగిరిలో ఒకటి, ఆఫీసు సబార్డినేట్ ఉద్యోగాలు - 4ను కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేస్తామన్నారు. మీడియేషన్ సెంటర్‌లో ఎల్‌డీ స్టెనో-1, టైపిస్ట్ కం అసిస్టెంట్-2, రికార్డు అసిస్టెంట్-1, ఆఫీస్ సబార్డినేట్-3 ఉద్యోగాలను ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 29 లోగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయానికి దరఖాస్తులు అందేలా పంపించాలని ఆమె కోరారు.

విజిలెన్స్ దూకుడు

- ప్రభుత్వ శాఖలపై ప్రత్యేక దృష్టి
- భారీగా పన్ను ఎగవేతలు వెలుగులోకి..
- రూ.265 కోట్ల లక్ష్యానికి రూ.270 కోట్ల గుర్తింపు
- ఆస్తి పన్ను, మార్కెట్ ఫీజు వసూళ్లు
- జిల్లా విజిలెన్స్ విభాగానికి మొదటి స్థానం



సాక్షి ప్రతినిధి, ఏలూరు: ప్రభుత్వానికి సక్రమంగా రావాల్సిన ఆదాయం పక్కదారి పట్టకుండా కాపాడటమే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రధాన లక్ష్యం. ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన ఆదాయాన్ని శాఖల వారీగా పరిశీలిస్తూ కీలక అంశాలు దర్యాప్తు చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించడం, ఇందుకు అనుగుణంగా విభాగాల వారీగా రావాల్సిన సెస్, పన్నులు వస్తున్నాయో లేదో పర్యవేక్షించడం వీరి విధి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో విజిలెన్స్ దూకుడు కనబర్చింది. లక్ష్యానికి మించి ప్రధాన శాఖల్లో పన్ను ఎగవేతలు, సెస్ బకాయిలను గుర్తించి రికవరీ చేయించడంలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది.

కీలక శాఖలపై నిఘా

వ్యవసాయ శాఖ మొదలు మైనింగ్ శాఖ వరకు కీలక ప్రభుత్వ శాఖల్లో పన్నుల ఎగవేతలు గుర్తించడం, శాఖాపరంగా వచ్చే ఫిర్యాదులపై క్షుణ్ణంగా క్షేత్రస్థాయిలో నెలలతరబడి పరిశీలించి పదుల సంఖ్యలో ఉద్యోగులను విచారించి నివేదికలు సమర్పించడం విజిలెన్స్ అధికారుల పని. తద్వారా ఖజానాకు చేరాల్సిన సొమ్ము సక్రమంగా వస్తుంది.. లేనిది పరిశీలించి సంబంధితులపై చర్యలకు సిఫార్సు చేస్తూ ప్రభుత్వానికి నివేదికలు ఇస్తుంటారు. ఈ క్రమంలో ఏటా జిల్లాల వారీగా విజిలెన్స్ విభాగానికి డీజీ లక్ష్యాన్ని నిర్దేశిస్తుంటారు. ఉమ్మడి జిల్లాకు 2022-23 ఆర్థిక సంవత్సరానికి రూ.265 కోట్ల వార్షిక లక్ష్యాన్ని నిర్దేశించగా రూ.270 కోట్ల మేర టార్గెట్ చేరుకుని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచారు. శాఖల వారీగా మొండిబకాయిలు, పన్ను ఎగవేతలపై నివేదికలు ఇవ్వగా.. దీని ఆధారంగా రూ.42.90 కోట్ల మేర పన్నులు, బకాయిలు, సీనరేజీ వసూలు అయ్యాయి.

రూట్ చెక్ ద్వారా..



2022-23 ఆర్థిక సంవత్సరంలో ఆకస్మిక తనిఖీలు, జాతీయ రహదారులపై తనిఖీలు నిర్వహించి రూ.9 కోట్ల ఎగవేతను గుర్తించాం. నూరు శాతం ప్రభుత్వ ఖజానాకు చెల్లించేలా చర్యలు తీసుకున్నాం. గతేడాది వార్షిక లక్ష్యాలను జిల్లా విజిలెన్స్ సిబ్బంది సమన్వయంతో అధిగమించింది. ప్రధానంగా వ్యవసాయశాఖలో అగ్రికల్చర్ మార్కెట్ పన్ను, ఆస్తి పన్ను ఎగవేతలను ఎక్కువగా గుర్తించి వాటి నుంచి రికవరీ కూడా ప్రభుత్వానికి ఎక్కువగా జరిగేలా చర్యలు తీసుకున్నాం.

– కరణం కుమార్, విజిలెన్స్ ఎస్పీ

- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో మార్కెటింగ్ శాఖ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఫీజు ఎగవేతకు ఎక్కువ మంది పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ఆకస్మిక తనిఖీలు, రికార్డులు పరిశీలించి రూ.10 కోట్ల పన్ను ఎగవేతలను గుర్తించి రూ.10 కోట్లు రికవరీ చేశారు.
- వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి రూ.4 కోట్ల పన్ను ఎగవేతను గుర్తించారు.

శాఖల వారీగా..

- రూ.107.12 కోట్ల ఆస్తి పన్ను, మొండి బకాయిలు, ప్రభుత్వ కార్యాలయాల బకాయిలను గుర్తించి రూ.23.29 కోట్లు రికవరీ చేశారు.
- రూ.36 కోట్ల మైనింగ్ సీనరేజీకి పన్ను ఎగవేతను గుర్తించి రూ.73 లక్షలు రికవరీ చేశారు.
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఖాళీ స్థలాల పన్నులు రూ.24.82 కోట్లు గుర్తించి రూ.4 కోట్లు వసూలు చేశారు.
- రూ.42.98 కోట్ల నీటి పన్ను ఎగవేతకు గుర్తించి రూ.4.53 కోట్లు వసూలు చేశారు.
- ప్రభుత్వ శాఖలకు సంబంధించి రూ.5.31 కోట్ల పన్నుల ఎగవేతను గుర్తించి రూ.35 లక్షలు వసూల్లు చేశారు.
- యూనివర్సిటీ ఫీజు రూ.7.22 కోట్లు, దేవదాయశాఖ ఆడిట్ ఫీజు రూ.38.75 కోట్ల ఎగవేతను గుర్తించారు.

ప్రజలంతా సీఎం జగన్ వెంటే..

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: రాష్ట్ర ప్రజలంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని, ఆయన్ను మరోమారు సీఎంగా గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తన పాలనా తీరుపై ప్రజాసర్వే నిర్వహించడం ఆదర్శనీయమన్నారు. ఈనెల 7న ప్రారంభమైన సర్వే 21 వరకు కొనసాగుతుందన్నారు. సుమారు 7 లక్షల మంది గృహసారథులు, కన్వీనర్లు రాష్ట్రంలోని 1.60 కోట్ల కుటుంబాలను కలిసి ప్రజాభిప్రాయాలను సేకరిస్తున్నారన్నారు. ఇప్పటికే 47 లక్షల కుటుంబాల అభిప్రాయాలను సేకరించగా వారంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే మద్దతుగా నిలిచారన్నారు. రానున్న ఎన్నికల్లోనూ జగన్‌కు మద్దతుగా నిలుస్తామని ప్రజలు చెప్పడం ఆనందంగా ఉందన్నారు. 47 లక్షల మంది మిస్డ్‌కాల్ ద్వారా ప్రభుత్వానికి మద్దతు తెలిపారన్నారు. మా భవిష్యత్తు, మా నమ్మకం జగనన్నే అంటూ ప్రజలంతా ఎలుగెత్తి చాటడం చరిత్రలో ఎన్నడూ లేదన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, చిత్రంలో జెడ్పీ చైర్మన్ కవురు

అన్నివర్గాలకు అండగా..

జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఇలా అన్నివర్గాలకు పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌కు తామంతా మద్దతుగా ఉంటామని మహిళలు ముక్తకంఠంతో చెబుతున్నారన్నారు. గతంలో చంద్రబాబు మోసపూరిత పాలనకు బలైపోయామని, వచ్చే ఎన్నికల్లోనూ టీడీపీని పూర్తిగా తుడిచేస్తామని ప్రజలు అంటున్నారన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ఆంజనేయులు, మండల కన్వీనర్ ముప్పిడి సంతోకుమార్, పట్టణ కన్వీనర్లు కొలుకులూరి ధర్మరాజు, కర్రి భాస్కరరావు, నాయకులు పాల్గొన్నారు.

కొనసాగిన దూరవిద్య పరీక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 10వ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు శనివారం కొనసాగాయి. చివరి రోజు పదో తరగతి సోషల్ పరీక్షకు 918 మందికి గాను 829 మంది, ఇంటర్ రసాయనశాస్త్రం పరీక్షకు 901 మందికి 810 మంది, అర్థశాస్త్రం పరీక్షకు 1,183 మందికి 1,068 మంది హాజరయ్యారు. జిల్లాలో 4 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, కేంద్రాలను తనిఖీ చేశాయని ఏలూరు డీఈఓ రవిసాగర్ తెలిపారు.

శ్రీనివాసా.. గోవిందా..

ద్వారకాతిరుమల: చిన్నతిరుపతి క్షేత్రంలో శనివారం భక్తులు పోటెత్తారు. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడంతో వేలాది మంది భక్తులు తరలివచ్చారు. వేకువజాము నుంచీ క్షేత్రంలోని అన్ని విభాగాల్లో భక్తుల రద్దీ కనిపించింది. సాయంత్రం వరకు భక్తుల తాకిడి కొనసాగింది. తిరుమల తిరుపతి దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో పలు భజన మండళ్ల సభ్యులు అనివేటి మండపంలో ప్రదర్శించిన కోలాట నృత్యాలు అలరించాయి.

ప్రతి ధాన్యం గింజనూ కొంటాం

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు టౌన్: రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శనివారం తణుకు మండలం దువ్వ గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ మేరకు ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తోందన్నారు. గత సార్వా కంటే మెరుగైన పద్ధతిలో రబీ పంట సొమ్ములను త్వరితగతిన బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామన్నారు. ధాన్యం అమ్మిన 21 రోజుల్లోనే ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తామన్నారు. గోనె సంచులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. రబీ సీజన్‌లో 6.40 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా 1.60 కోట్ల గోనె సంచులు అవసరమని గుర్తించామని, ఈ మేరకు ఇప్పటికే 80 లక్షల సంచులను అందుబాటులో ఉంచామన్నారు.

సకాలంలో సొమ్ములు

జిల్లా జాయింట్ కలెక్టర్ రామసుందర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు సకాలంలో ధాన్యం సొమ్ములతో పాటు సంచులు, రవాణా, హమాలీ చార్జీలు చెల్లిస్తామన్నారు. నరసాపురం సబ్ కలెక్టర్ తేజ్‌భరత్ మాట్లాడుతూ రైతుల కళ్లాల వద్దకే ఆర్‌బీకే సిబ్బంది వెళ్లి ధాన్యాన్ని కొనుగోలు చేస్తారని చెప్పారు. సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్ మాట్లాడుతూ లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణకు చర్యలు తీసుకున్నామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో తేమ యంత్రాన్ని మంత్రి పరిశీలించారు. రబీ ధాన్యం కొనుగోలుకు సంబంధించి కరపత్రాలు ఆవిష్కరించారు. జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా సహకార అధికారి ఎం.రవికుమార్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి ఎస్.సరోజ, ఎంపీపీ రుద్ర ధనరాజు, ముళ్లపూడి బాబూరావు, సొసైటీ అధ్యక్షుడు జేకే రాజు, సర్పంచ్ అడ్డా బాబు, తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి, జేసీ రామసుందర్‌రెడ్డి

తాగునీటి సమస్యలపై మానిటరింగ్ సెల్

భీమవరం(ప్రకాశం చౌక్): తాగునీటి సమస్యలు పరిష్కారం కోసం జిల్లాస్థాయిలో మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసినట్లు జిల్లా గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఏఎస్ఏ రామస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే ఫోన్ చేసి తెలియజేయవచ్చని పేర్కొన్నారు. ఫిర్యాదు అందిన 24 గంటల్లోపు సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు. సెల్ 9505116689 నంబర్‌లో కె.సాయి శిరీష, సీనియర్ అసిస్టెంట్‌ను ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, ఎం.కోటేశ్వరరావు టైపిస్ట్‌ను మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సంప్రదించవచ్చని, అలాగే జిల్లాలో గ్రామీణ నీటి సరఫరా డీఈఈ కార్యాలయాల్లోనూ ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

యువతే లక్ష్యం.. గంజాయి విక్రయం

- పాలకొల్లుకి చెందిన ముగ్గురు స్నేహితులు కలిసి ఇటీవల విశాఖ జిల్లా పాడేరు వెళ్లి నాలుగు కిలోల గంజాయి కొనుగోలు చేశారు. తణుకు తీసుకువచ్చి పొట్లాలు కట్టి విద్యార్థులకు విక్రయించే క్రమంలో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో ఇంటర్, బీటెక్ చదువుతున్న యువకులు ఉన్నారు.
- తణుకు పాతవూరుకు చెందిన నలుగురు మైనర్లు గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు దాడి చేశారు. స్థానిక కొమ్మాయి చెరువు గట్టు ప్రాంతంలో దాచిన గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారు గతేడాది పదోతరగతి పూర్తి చేసిన వారు కావడం గమనార్హం.
- తణుకులో ఇరగవరం రోడ్డు కాలనీతోపాటు సజ్జాపురం ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులతోపాటు మరో బాలుడు కలిసి గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు దాడి చేశారు. వారి వద్ద 22 కిలోల గంజాయితోపాటు అధునాతన బైక్ స్వాధీనం చేసుకున్నారు.

- చాపకింద నీరులా విక్రయాలు
- సమిధలవుతున్న విద్యార్థుల జీవితాలు
- జిల్లాలో గంజాయి ఆనవాళ్లు

తణుకు: గంజాయి విక్రయాలు చాపకింద నీరులా విస్తరిస్తుండగా బడ్డీకొట్లు, పాన్‌షాపుల్లో సైతం విరివిగా లభ్యమవుతోంది. కాలేజీలకు వెళ్లి చదువుకోవాల్సిన కొందరు యువకులు గంజాయి మత్తులో జోగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. గతంలో రహస్యంగా జరిగే ఈ విక్రయాలు ప్రస్తుతంగా బాహాటంగానే జరుగుతున్నాయి. చిన్నప్యాకెట్లు మొదలు కిలోల వరకు కావాల్సిన మొత్తంలో అందుబాటులో ఉంటోంది. విశాఖ జిల్లా కేంద్రంగా దిగుమతి చేసుకుని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా బహిరంగంగానే విక్రయిస్తుండటం అధికమవుతోంది. గంజాయిని వినియోగిస్తున్న వారిలోనే కాదు తరలిస్తున్న వారిలోనూ యువకులు ముఖ్యంగా విద్యార్థులు ఉండటం విశేషం. మత్తులో నేరాలు సైతం అదే స్థాయిలో పెరుగుతున్నాయి. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనల్లో గంజాయి వినియోగం తేటతెల్లమవుతుండగా పోలీసులు క్షేత్రస్థాయిలో దృష్టి సారించాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తోంది. వివిధ నేరాల్లో భాగస్వాములైన వారు గంజాయి తీసుకుంటున్నట్లు తేలడం ఆందోళన కలిగిస్తోంది.



యువకులను కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్పీ రవిప్రకాష్ (ఫైల్)



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి (ఫైల్)

యువతే లక్ష్యంగా.. మద్యం, గంజాయి ఇతర మత్తు పదార్థాలకు బానిసవుతున్న యువకులు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. విశాఖ జిల్లా మన్యం నుంచి గంజాయి తరలిస్తున్న మాఫియా ముఖ్యంగా యువతకు ఎరవేస్తోంది. గంజాయి మాఫియా ఉచ్చులో యువతతోపాటు విద్యార్థులు, మైనర్లు కూడా పడుతున్నారు. పలురకాలుగా గంజాయిని సేవించడం ఫ్యాషన్‌గా మారింది. ఈ క్రమంలో పాకెట్ మనీ, పార్ట్‌టైం ఉద్యోగాల ద్వారా సంపాదించుకున్న నగదును సైతం గంజాయికే ఖర్చు పెడుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని కొన్ని కళాశాలలు, హాస్టళ్లు, శివారు ప్రాంతాల్లోని స్థావరాల్లో రాత్రిళ్లు గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

అప్రమత్తంగా ఉన్నాం

జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలపై అప్రమత్తంగా ఉన్నాం. ఇప్పటికే అనుమానిత ప్రాంతాల్లో నిఘా ఉంచి నిందితులపై చర్యలు తీసుకున్నాం. విద్యార్థులు, యువకులు మత్తుకు బానిసలై జీవితాలు నాశనం చేసుకోకుండా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. ఇందుకు భీమవరం, నరసాపురం ప్రాంతాల్లో కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం.

– యు.రవిప్రకాష్, జిల్లా ఎస్పీ, భీమవరం

గంజాయి జాడలపై ఆరా..

ఇటీవల జరిగిన కొన్ని నేర సంఘటనలు, వాటిలో భాగస్వాములైన వారు గంజాయి తీసుకుని ఉండటం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్న జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. గంజాయి క్రయ, విక్రయాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి వారి సెల్‌ఫోన్ ద్వారా నంబర్లు సేకరించి గంజాయి వినియోగిస్తున్నట్లుగా నిర్ధారణ అయిన విద్యార్థులు, యువకులు వారి తల్లిదండ్రులకు ఇటీవల ఎస్పీ రవిప్రకాష్ తణుకులో కౌన్సెలింగ్ నిర్వహించారు. అయితే కేవలం వినియోగిస్తున్న, కొనుగోలు చేస్తున్న వారిని మాత్రమే అరెస్టు చేస్తున్న పోలీసులు పెద్ద మొత్తంలో సరఫరా చేస్తున్న పాత్రధారులు, సూత్రధారులపై దృష్టి సారించకపోవడంతో ఈ వ్యాపారానికి అడ్డుకట్ట పడటంలేదు. ఇప్పటివరకు చిక్కకుండా తిరుగుతున్న వారిపై దృష్టి సారించిన పోలీసులు వారిని సైతం పట్టుకునేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు సమాచారం. అలాగే కాలేజీలు, హాస్టళ్లపై నిఘా ఉంచి గంజాయి క్రయ, విక్రయాలపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా ఐఓటీ ఎక్స్‌పో-23



ఐవోటీ ఎక్స్‌పోలో ప్రదర్శించిన మోడల్స్

నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐఓటీ ఎక్స్‌పో-23 రెండో రోజు శనివారం ఉత్సాహంగా కొనసాగింది. దీనిలో విద్యార్థులు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) తయారు చేసిన పలు మోడల్స్ వీక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ ఎక్స్‌పోను వీక్షించేందుకు పట్టణంలోని పలు పాఠశాల విద్యార్థులు తరలివచ్చారు. ఇంజినీరింగ్ విద్యార్థులు వివరిస్తున్న అంశాలను శ్రద్ధగా విన్నారు. ఈ ఎక్స్‌పోలో ఫైర్ ఇంజిన్ రోబోట్, స్మార్ట్ సర్వేలెన్స్, ఎమెర్జెన్సీ రెస్పాన్స్ సిస్టమ్, స్మార్ట్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, మిలటరీ పెట్రోలింగ్, వాహన ప్రమాద హెచ్చరిక వ్యవస్థ, ల్యాండ్ మైన్ గుర్తింపు సిస్టమ్ తదితర మోడల్స్‌ను విద్యార్థులు ప్రదర్శించారు. ఈసీఈ హెచ్‌వోడీ పీ శ్యామ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎక్స్‌పోలోని మోడల్స్‌ను పలువురు అధ్యాపకులు, సిబ్బంది పరిశీలించారు.

సుస్వరనాదం.. రామతులసి సంగీతం

- నాదస్వర వాయిద్యంలో రాణిస్తున్న రామతులసి
- భర్తతో కలిసి శుభకార్యాలు, కచేరీల్లో ప్రదర్శనలు
- బిరుదులు, ప్రశంసలు అందుకుంటున్న భార్యాభర్తలు

నాదస్వర సంగీతంలో రాణిస్తూ పలువురి మన్ననలు అందుకుంటున్నారు ద్వారకాతిరుమలకు చెందిన అలవలపాటి రామతులసి. పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, ఇతర శుభకార్యాల్లో తనదైన శైలిలో భర్తతో కలిసి నాదస్వరాన్ని శ్రావ్యంగా వినిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. నాదస్వర సంగీతాన్ని ఉపాధిగా ఎంచుకుని భర్తకు చేదోడుగా నిలుస్తున్నారు.



నాదస్వరం ఊదుతున్న రామతులసి

సండే స్పెషల్

ద్వారకాతిరుమల: సంగీతంలో రామతులసికి తొలి గురువు ఆమె తండ్రి రావిపాటి కేశవరావు. ఆయన శ్రీవారి ఆలయంలో సన్నాయి వాయిద్యకారుడిగా పనిచేసేవారు. ఆడపిల్ల అని చిన్నచూపు చూడకుండా.. అన్నింటా రాణించగలదన్న నమ్మకంతో ఆమెకు సన్నాయి వాయిద్యాన్ని నేర్పించారు. ఆయన మరణానంతరం రామతులసి కావలిలోని అల్లూరి వెంకట శేషయ్య, సుబ్రహ్మణ్యంల వద్ద శిక్షణ తీసుకుంది. అనంతరం శ్రీవారి ఆలయంలో వాయిద్యకారుడిగా, కేశఖండనశాలలో క్షురకుడిగా పనిచేస్తున్న అలవలపాటి వీర్రాజును 30 ఏళ్ల క్రితం వివాహం చేసుకుంది.

భర్త ప్రోత్సాహంతో..

భార్య ప్రతిభను వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నాడు భర్త వీర్రాజు. దీంతో రామతులసి నాదస్వర సంగీతంలో పట్టు సాధించింది. భర్తతో కలసి పెళ్లిళ్లు, పేరంటాళ్లకు వెళ్లి నాదస్వరాన్ని ఆలపిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆమె సన్నాయి వాయిద్యం శుభకార్యాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. అంతే కాదు సన్నాయి కచేరీలు ఎక్కడ జరిగినా భర్తతో కలసి పాల్గొంటూ.. ప్రముఖుల నుంచి సత్కారాలు, ప్రశంసలను అందుకుంటోంది. తాజాగా ఈ ఏడాది ఉగాది పండుగనాడు హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కళామందిరంలో విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కచేరీలో ఈ దంపతులు పాల్గొని తమ సంగీతంతో శ్రోతలకు వీనులవిందు చేశారు. ఈ సందర్భంగా విశ్వగురు సీఈఓ సత్యవోలు రాంబాబు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ఇటీవల టీటీడీలో జరిగిన నాదనీరాజనం కార్యక్రమంలో వినిపించిన నాదస్వరం శ్రోతలను రంజింపచేసింది.



హైదరాబాద్‌లో ఉగాది పురస్కారాన్ని అందుకుంటున్న రామతులసి, వీర్రాజు దంపతులు

బిరుదులు.. సత్కారాలు..

- 1993లో ఢిల్లీలో తెలుగు సంఘం ఆధ్వర్యంలో వీర్రాజు, రామతులసి దంపతులను సత్కరించారు
- 2020 నవంబర్ 30న విశాఖపట్నంలో ఆంధ్రరత్న బిరుదు పొందారు.
- 2019 డిసెంబర్ 3న విజయవాడలో ఆంధ్ర స్టార్ అవార్డు అందుకున్నారు.
- 2019 డిసెంబర్ 15న ద్వారకాతిరుమలలో సుస్వర సునాద కళాభూషణ బిరుదును పొందారు
- 2023 మార్చి 22న హైదరాబాద్‌లో ప్రవాస భారతీయుల ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మంగళవాయిద్య సమ్మేళనంలో ఉగాది పురస్కారం అందుకున్నారు.



వీర్రాజు, రామతులసి దంపతులను అభినందిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు (ఫైల్)

వృత్తి సంతృప్తినిస్తోంది

వారసత్వ సంపదగా వస్తున్న ఈ నాదస్వర సంగీతంలో రాణించడం మాకు చాలా ఆనందాన్ని కలిగిస్తోంది. అలాగే ఈ వృత్తి సంతృప్తినిస్తోంది. పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, ఇతర శుభకార్యాలు, కచేరీల్లో పాల్గొంటున్నాం. ప్రముఖులు, ప్రజల నుంచి అందుతున్న ప్రశంసలు మమ్మల్ని మరింతగా ప్రోత్సహిస్తున్నాయి.

– అలవలపాటి వీర్రాజు, రామతులసి దంపతులు

చంద్రబాబు సభల బాధితులకు పరామర్శ



నూజివీడులో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు, నాయకులు

నూజివీడు: చంద్రబాబు సభలకు హాజరై విద్యుత్ షాక్ వల్ల గాయాలపాలై చికిత్స పొందుతున్న పలువురు క్షతగ్రాతులను ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శనివారం పరామర్శించారు. ఏలూరు జిల్లా నూజివీడు మండలంలోని సీతారామపురానికి చెందిన 16 మంది మహిళలను చంద్రబాబు సభ నిమిత్తం వారికి స్టీలు పైపులతో ఏర్పాటు చేసిన జెండాలను ఇచ్చి నూజివీడుకు తీసుకువచ్చారు. నూజివీడులో జెండాలను పైకి ఎత్తడంతో కరెంటు తీగలు తగిలి విద్యుత్ షాక్‌కు గురై సువార్త అనే వృద్ధురాలికి తీవ్ర గాయాలవ్వగా, మరో తొమ్మిది మందికి గాయాలయ్యాయి. ముగ్గురు క్షతగాత్రులు సువార్త, జె.దివ్య, బండారు సుధ పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు ఆసుపత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. క్షతగాత్రులు తమకు రూ.300 ఇస్తామంటే ట్రక్కు ఆటోలో ఎక్కి వచ్చామని, జెండాలు పైకి ఎత్తాలని చెప్పడంతో పైకి ఎత్తగానే కరెంటు తీగలు తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యామని కన్నీరుమున్నీరయ్యారు. తమను ఆదుకోవాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే వైద్యులతో మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూసి త్వరగా కోలుకునేలా చూడాలని కోరారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నూజివీడు పట్టణ, మండల, ముసునూరు అధ్యక్షులు శీలం రాము, పోలిమెట్ల శివ, మూల్పూరి నాగమల్లేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, నాయకుడు కవులూరి యోగి ఉన్నారు.

18న అండర్-23 క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్-23 పురుషుల క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 18న చేపట్టనున్నామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి జి.ఆదిత్యవర్మ, వీవీవీఎస్ఎం శ్రీనివాసరాజు శనివారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆశ్రం కళాశాల మైదానంలో ఉదయం 9 గంటలకు ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. 2000 సంవత్సరం సెప్టెంబర్ ఒకటో తేదీ తర్వాత పుట్టిన క్రీడాకారులు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఆసక్తి గలవారు పుట్టిన తేదీ, ఆధార్, స్టడీ సర్టిఫికెట్స్ జిరాక్స్‌తో హాజరుకావాలని సూచించారు. మరింత సమాచారం కోసం 94910 44848 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

భారీగా బంగారం పట్టివేత



పట్టుకున్న బంగారంతో పాటు నిందితుడిని చూపిస్తున్న సీఐ బి.వెంకటేశ్వరరావు

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి సమీపంలోని తాటాకులగూడెం అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీల్లో బిల్లులు లేని బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ బి.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, పోలవరం డీఎస్పీ కె.లతాకుమారి ఆదేశాలతో సీఐ బి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒక కారులో ఎటువంటి బిల్లులు లేకుండా బంగారాన్ని రవాణా చేస్తున్న ప్రవీణ్ మనీష్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మైలవరం గ్రామానికి చెందిన మనీష్ జంగారెడ్డిగూడెంకు బంగారు ఆభరణాలను తీసుకువెళుతున్నట్లు గుర్తించారు. పట్టుబడిన బంగారం 1150.234 గ్రాముల వరకూ ఉంటుందని, వీటి విలువ రూ.65,79,338 వరకూ ఉండవచ్చని సీఐ వివరించారు. అలాగే కారును కూడా స్వాధీనం చేసుకున్నామని, తదుపరి చర్యల నిమిత్తం జంగారెడ్డిగూడెం అసిస్టెంట్ కమిషనర్ స్టేట్ ట్యాక్స్ వారికి అప్పగిస్తున్నట్లు సీఐ చెప్పారు.

గడపగడపకు సంక్షేమం



తాడేపల్లిగూడెం రూరల్ : తాళ్లపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళ సమస్యను తెలుసుకుంటున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



కాళ్ల : కోపల్లెలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

నైపుణ్యాలతోనే ఉజ్వల భవిష్యత్

తాడేపల్లిగూడెం: విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేవి నైపుణ్యాలేనని ఏపి నిట్ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ దినేష్ పి.శంకరరెడ్డి అన్నారు. కెమికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఆస్పెన్ ప్లస్ సాఫ్ట్‌వేర్‌పై రెండు రోజులుగా జరుగుతున్న వర్కుషాప్ శనివారం ముగిసింది. విభాగాధిపతి వినోత్‌కుమార్ రాజా అధ్యక్షత వహించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ పరిశ్రమల్లో తయారయ్యే ఉత్పత్తులను డిజైన్ చేయడంతో పాటు వాటి నాణ్యతను తెలుసుకోడానికి ఆస్పెన్ ప్లస్ సాఫ్ట్‌వేర్ ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు ఆధునిక పరిజ్ఞానం ఉపయోగించుకుని, పారిశ్రామికవేత్తలకు అవసరమైన కొత్త సాఫ్ట్‌వేర్‌లకు రూపకల్పన చేయాలన్నారు. ఇలా పట్టు సాధించిన విద్యార్థులకు పలు కంపెనీలు రెడ్‌కార్పెట్ పర్చి ఉద్యోగాలకు ఆహ్వానిస్తున్నాయన్నారు. నిట్‌లో ఉన్న సౌకర్యాలను వినియోగించుకుని ఎదగాలన్నారు. కార్యక్రమానికి రీసోర్సుపర్సన్లుగా వరంగల్ నిట్ కెమికల్ ఇంజనీరింగ్ ఆచార్యులు అన్నే శరత్‌బాబు, వి.రామ్‌సాగర్, కుకునూరి మనోహర్ మాట్లాడారు. వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఏపి నిట్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ దినేష్ పి.శంకరరెడ్డి

కమనీయం.. శ్రీనివాస కల్యాణం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన లక్ష్మీపురంలోని సంతాన వేణుగోపాల జగన్నాథ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం రాత్రి శ్రీనివాసుని దివ్యకల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థుల వేద మంత్రోచ్చరణల నడుమ జరిగిన ఈ కల్యాణ తంతు భక్తులకు నేత్రపర్వమైంది. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్లను పల్లకి వాహనంలో ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం అట్టహాసంగా పల్లకి వాహనాన్ని ఆలయ ఆవరణలోని కల్యాణమండపం వద్దకు తీసుకువచ్చారు. అప్పటికే విశేషంగా అలంకరించిన వేదిక్పై స్వామి, అమ్మవార్ల కల్యాణ మూర్తులను ఉంచి అర్చకులు పుష్పాలంకారాలు చేశారు. ఆ తర్వాత అర్చకులు, పండితులు నీరాజనాలు సమర్పించి కల్యాణ తంతును ప్రారంభించారు. సుముహూర్త సమయంలో నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపజేసి, మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకలను భక్తుల గోవింద నామస్మరణల నడుమ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ పి.నటరాజారావు, ఆలయ సూపరింటెండెంట్ డీవీఎస్ రాజు, దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యులు పెద్దిరెడ్డి వెంకటకొండ పద్మ, జ్యోతి శ్రీనివాస్ దంపతులు, మానుకొండ సుబ్బారావు, పాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాసుని కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

చంద్రబాబుకు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ సవాల్

- తనపై ఆరోపణలు నిరూపిస్తే రాజీనామా చేస్తానని వెల్లడి
- నిరూపించలేకపోతే బాబు రాజీనామా చేస్తావా అని డిమాండ్
- ఆధారం ఉంటే 18వ తేదీ కల్లా బహిర్గతం చేయాలని డిమాండ్
- ఎన్ని తపస్సులు చేసినా చంద్రబాబు ముఖ్యమంత్రి కాలేడని స్పష్టీకరణ



నూజివీడు: తాను, తన కుమారుడు ఇసుకను అక్రమంగా అమ్ముకోవడం, భూములు ఆక్రమించడం చేస్తున్నామని చేసిన ఆరోపణలను చంద్రబాబు నిరూపిస్తే తాను రాజీనామా చేస్తానని, నిరూపించలేకపోతే మీరు రాజీనామా చేస్తారా అని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు చంద్రబాబుకు సవాల్ విసిరారు. ఏమైనా ఆధారం ఉంటే ఈ నెల 18వ తేదీ కల్లా చెప్పాలని స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా నూజివీడులోని ద్వారకా ఎస్టేట్‌లో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చంద్రబాబు తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గతంలో టీడీపీ స్థానిక ఇన్‌చార్జి మూడుసార్లు సవాల్ చేసి తోకముడిచారని చెప్పారు. ఎన్ని తపస్సులు చేసినా చంద్రబాబు ముఖ్యమంత్రి కాలేడని, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఎన్టీఆర్ టీడీపీని స్థాపిస్తే అదే కాంగ్రెస్‌తో చంద్రబాబు అంటకాగి తెలంగాణలో పొత్తు పెట్టుకున్నాడని ధ్వజమెత్తారు. నూజివీడులో రాజధానిని ఏర్పాటు చేస్తానని అసెంబ్లీలో ప్రకటించి, నీవు, నీ అనుచర వర్గం భూములు కొనుక్కున్న తరువాత తుళ్లూరులో రాజధానిని పెట్టి మూడు పంటలు పండే వ్యవసాయ భూములను నాశనం చేసిన ఘనుడివి అంటూ చంద్రబాబుపై మండిపడ్డారు.

మామిడి రైతుల గురించి మాట్లాడే అర్హత బాబుకు లేదు

కరువు, చంద్రబాబు స్నేహితులని, 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉంటే అన్ని సంవత్సరాలూ వర్షాలు పడలేదని ఎమ్మెల్యే మేకా ప్రతాప్ గుర్తు చేశారు. 2001లో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడి మామిడి చెట్లు ఎండిపోతే చెట్టుకు రూ.30 ఇచ్చిన చంద్రబాబుకు నేడు మామిడి రైతుల గురించి మాట్లాడే అర్హత కూడా లేదన్నారు. ఆ రూ.30కి మామిడి మొక్క కూడా రాదని చెప్పారు. చంద్రబాబు జీవితమంతా మోసపూరిత మాటలేనని, డ్వాక్రా మహిళలకు, రైతులకు రుణమాఫీ చేస్తానని చెప్పి 2014లో అధికారంలోకి వచ్చిన తరువాత రుణమాఫీ చేయకుండా చంద్రబాబు మోసం చేశాడని విమర్శించారు. అందుకే నూజివీడులో నిర్వహించిన సభ జనం లేక అట్టర్ ఫ్లాప్ అయిందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు మూడుసార్లు నూజివీడుకు వచ్చి మూడు మొక్కలు నాటాడే తప్ప అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదన్నారు. చంద్రబాబు హయాంలో లిక్కరు పల్లె టూళ్లలో ఏరులై పారిందని, బెల్టుషాపుల ద్వారా మద్యం అమ్మించిన ఘనత చంద్రబాబుదేనని, జగన్ సీఎం అయిన తరువాత బెల్టుషాపులన్నింటినీ మూయించారని చెప్పారు.

పేదలకు వేల ఎకరాలు పంచిన చరిత్ర మాది

నూజివీడు ప్రాంతంలో తమ తాతల పేరుతో వేల ఎకరాలు ఉండగా, అందులో పేదలు సాగు చేసుకుంటున్నారని, వారందరికీ పట్టాలు ఇవ్వమని రెవెన్యూ ఉన్నతాధికారులకు సైతం చెప్పి తాను లెటర్‌ను సైతం అందించానని ఎమ్మెల్యే మేకా ప్రతాప్ చెప్పారు. నూజివీడులోని ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసిన స్థలాలన్నీ తమవేనని, తాము పేదలకు వేలాది ఎకరాలు పంచిపెడితే ఆక్రమించుకోవాల్సిన పనేమిటని ప్రశ్నించారు. నూజివీడులో ట్రిపుల్ ఐటీ, మామిడి పరిశోధన స్థానం, ఎమ్మార్ అప్పారావు కాలనీ, కృష్ణాజలాల పథకం, వీటీహెచ్ ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతో అభివృద్ధి చేశామని వివరించారు. చంద్రబాబు పాలనలో మాత్రం అభివృద్ధి శూన్యమని దుయ్యబట్టారు. ఆటోనగర్ అభివృద్ధి చెందడం లేదని, 2006లో ఏపీఐఐసీతో మాట్లాడి ఆటోనగర్‌లోని ప్లాట్లను విక్రయించి కొన్ని పరిశ్రమలను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఒడి, రైతు భరోసా, ఆసరా, జగనన్న తోడు, వాహనమిత్ర, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం తదితర 26 సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, నీ ప్రభుత్వంలో ఏనాడైనా చెప్పుకోవడానికి ఒక్క పథకమైనా అమలు చేశావా అని ఎమ్మెల్యే నిలదీశారు. 'ఒక్కొక్కరికి రూ.300 ఇచ్చి నీ సభకు జనాన్ని తరలించారు.. ఇలాంటి నీచ సంస్కృతి రాజకీయాల్లో నీ పార్టీ నుంచే పుట్టింది. ఇప్పటికైనా ఇలాంటి నికృష్ట సంస్కృతిని మానుకోవాలి' అంటూ హితవు పలికారు.

క్లుప్తంగా

కోదండ రామాలయాన్ని సందర్శించిన మంత్రి కొట్టు



మంత్రి కొట్టుకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలుకుతున్న రామాలయం కమిటీ సభ్యులు

తాడేపల్లిగూడెం అర్బన్ : ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తన స్వగృహానికి సమీపంలోని పునఃనిర్మాణం చేస్తున్న కోదండ రామాలయాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నివాస ప్రాంతంలో ఉన్న కోదండ రామాలయం పునఃనిర్మాణానికి రూ. కోటి అందచేసినట్లు చెప్పారు. ఈ రామాలయం అభివృద్ధికి స్థానిక ప్రజలు తనను కలిసి సహకారం కోరారన్నారు. ఈ మేరకు రామాలయం అభివృద్ధికి దేవదాయ శాఖ మంత్రిగా తనవంతు సహకారం అందించామన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎయిర్‌స్ట్రిప్ మహిళా వాకర్స్ అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్‌లో శనివారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. వాకర్స్ జిల్లా గవర్నర్ శెనగన క్రిష్ణ మూర్తి మాట్లాడుతూ వేసవి దృష్ట్యా పాదచారులు, వాహనదారుల దప్పిక తీర్చడానికి స్వచ్ఛంధ సంస్థలు ముందుకు వచ్చి పట్టణంలో విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కార్యదర్శి కుంట్ల కనకదుర్గ, కోశాధికారి కర్రి ప్రభావతి, రామలక్ష్మి, అరుణకుమారి, ఇందిరా కుమారి, ఉదయ కుమారి, వీఎస్ ప్రసాద్, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఇరగవరం ఈవోపీఆర్డీగా మునిరాజు



బాధ్యతలు స్వీకరించిన ఈవోపీఆర్డీ ముని రాజు

ఇరగవరం: మండలంలోని ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీగా వై.మునిరాజు బాధ్యతలు అప్పగించడం జరిగిందని ఎంపీడీవో పి.శ్రీనివాసరావు తెలిపారు. ప్రస్తుతం ఈవోపీఆర్డీగా బాధ్యతలు నిర్వహిస్తున్న కృష్ణమోహన్ సెలవులో ఉండడంతో ఆయన స్థానంలో కావలిపురం కార్యదర్శి పనిచేస్తున్న మునిరాజుకి బాధ్యతలు అప్పగించడం జరిగిందన్నారు. గ్రామ పంచాయతీ, సచివాలయాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలందిస్తానని మునిరాజు తెలిపారు. గ్రామాల్లో సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

గోనె సంచులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి



తేతలి రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ ఎస్ రామ సుందర్‌రెడ్డి

తణుకు టౌన్: ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ రామ సుందర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌బీకే పనితీరును పరిశీలించారు. రిజస్టర్లు, సిబ్బంది హాజరు, నమోదైన స్టాకు, ప్రస్తుతం ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. గోనె సంచులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అధికార్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఎం సూర్యతేజ, జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, వ్యవసాయ సిబ్బంది, ఆర్‌బీకే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

ఇరగవరం: మండలంలోని రేలంగి గ్రామంలో అంబేడ్కర్ 132వ జయంతిని సందర్భంగా ఇందిర నగర్‌లో శనివారం నవ యువ అరుంధతి సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు పులుపు సునీల్, సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యంలు ప్రారంభించారు. యువకులు రక్తదానం చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ ఆ మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రక్తదానం చేసిన యువకులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ తాతపూడి బోస్, చేబ్రోలు పెద్దిరాజు, చుక్కా సాయి బాబా తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో జగన్ విజయం తథ్యం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తాళ్ళపాలెం, ఉప్పరగూడెంలో గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజాబలంతో 2024 ఎన్నికల్లో భారీ మెజార్టీతో జగన్ విజయం సాధించడం తథ్యమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శనివారం రాత్రి తాడేపల్లిగూడెం మండలం ఉప్పరగూడెం, తాళ్లపాలెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ అందుతున్నది లేనిది ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన పట్ల ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారన్నారు. 2024 ఎన్నికల్లో తిరిగి జగన్‌ను ముఖ్యమంత్రిని చేస్తామంటూ ప్రజలు ముక్త కంఠంతో స్పష్టం చేస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నా చంద్రబాబుకు అవేమీ పట్టడం లేదన్నారు. ఐదేళ్ల చంద్రబాబు పాలనలో చేసిన తప్పిదాలే పార్టీ రాజకీయ భవిష్యత్‌ను ప్రశ్నార్థకంగా మార్చిందన్నారు. అయినప్పటికీ ప్రభుత్వంపై అబద్దాలు ప్రచారం చేస్తున్నారన్నారు. చంద్రబాబు, పవన్ కలయిక చిదంబర రహస్యంగా ఉందన్నారు. వీరిద్దరు కలిస్తే ఆకాశం నేలకొస్తుందన్న భ్రమలో ఆ పార్టీ నాయకులు ఉన్నారన్నారు. ఇదిలా ఉంటే గ్రామంలో డ్రెయినేజీ సమస్యను ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. రెవెన్యూ, సంబంధిత శాఖ అధికారులకు తగుఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. డ్రెయినేజీ సమస్యను జేసీబీ లేదా ఉపాధి హామీ పథకంలో పెట్టి చేయిస్తామన్నారు. త్వరలోనే ఈ సమస్యను పరిష్కారమవుతుందని భరోసా నిచ్చారు. దీన్ని బట్టి ప్రభుత్వం ఎంత చిత్తశుద్ధితో పనిచేస్తుందో అర్థమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దండే కనకబాబు, వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వీఎస్.వేణుగోపాల్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, ఏపీవో ఏవీవీఎస్‌వీ.ప్రసాద్, హౌసింగ్ ఏఈ వైవీ.వెంకట్రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, కార్యదర్శులు అంకం శ్రీరామకృష్ణ, ఘంటా మానస, ఎలక్ట్రికల్ ఏఈ ఎ.రామకృష్ణ, మాజీ సర్పంచ్‌లు దాకే పండియ్య, రాపాక భానుమూర్తి, ఏలూరి వెంకట్రావు, దండే చినగోతియ్య, దేశాబత్తుల శాంతారావు, ముప్పిడి సంపత్‌కుమార్, సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, జద్దు హరిబాబు, ఏఎంసీ డైరెక్టర్ తమ్మిశెట్టి చుక్కయ్య, ఆర్‌బీకే చైర్మన్ ములగాల గంగారావు, వలంటీర్లు, గృహసారథులు, అధికారులు, ఆశాలు, ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాల మంజూరు

- పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి...
- తణుకు 14వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



తణుకులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ బ్రోచర్ అందిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అభిమతమని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు 14వ వార్డు కొమ్మాయిచెర్వు ప్రాంతం నుంచి నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలను అందించి వారి కుటుంబాన్ని అభివృద్ధి పరిచేందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎంతో కృషిచేస్తున్నారని అన్నారు. కోవిడ్ పరిస్థితుల్లో సైతం ఎన్ని కష్టాలు ఎదురైనా ఏఒక్క సంక్షేమ పథకం ఆపకుండా అమలు చేసిన విషయాన్ని ప్రజానీకం గుర్తుంచుకోవాలని అన్నారు. ప్రజలంతా ఎవరు మంచి చేశారో గ్రహించాలని కోరారు. మునిసిపల్ కమిషనర్ కేటి సుధాకర్, డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డి విద్యుత్ శాఖ డీఈఈ సీహెచ్ రామకృష్ణ, హౌసింగ్ ఏఈ వెంకట్రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, నాయకులు తిర్రే విజయకృష్ణ, కొఠారు రామాంజనేయులు, దున్నాల ఉమామహేశ్వరరావు, సత్తా కృష్ణవేణి పాల్గొన్నారు.

అందరివాడిగా అందుబాటులో ఉంటా...

తణుకు అర్బన్: తణుకు నియోజకవర్గంలో అన్ని వర్గాలకు అందరివాడుగానే అందరికీ అందుబాటులో ఉంటానని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు బీసీ కమ్యూనిటీ హాలు భవనంలో శనివారం నిర్వహించిన శెట్టిబలిజ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్తిలి మండలం మంచిలి గ్రామానికి సంబంధించి రామాలయం విషయంలో రెండు వర్గాల మధ్య తలెత్తిన సమస్య తనకు ఆలస్యంగా తెలిసిందని, తెలిసిన వెంటనే అదే వర్గానికి చెందిన పెద్దలతో ఏ వర్గం ఇబ్బంది పడకుండా సమస్య పరిష్కరించాల్సిందిగా చెప్పామన్నారు. శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, తదితరులు

తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెం మండలం లింగారాయుడుగూడెం గ్రామానికి చెందిన వీరమళ్ళ ఆదికృష్ణ ప్రమాదవశాత్తు కొన్ని రోజుల క్రితం మృతి చెందాడు. ఆదికృష్ణను ఆదుకొనేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. అతని కుటుంబ సభ్యులకు రూ. లక్షలను ఉపముఖ్యమంత్రి మంత్రి కొట్టు సత్యనారాయణ శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో అందచేశారు. ఆదికృష్ణ మృతి చెందడం విచారకరమని అన్నారు. అతని కుటుంబాన్ని ఆదుకొనేందుకు ఆర్థిక సాయం అందించడంతోపాటు ప్రభుత్వం అందించే గృహాన్ని మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాసు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మండుటెండలోనూ అదే జోరు



తణుకులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



అత్తిలి మండలం మంచిలిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



రావిపాడు గ్రామంలో ప్రభుత్వ పథకాలను ప్రచారం చేస్తున్న సొసైటీ అధ్యక్షుడు దేవ వెంకటరమణ

తణుకు అర్బన్: భానుడు భగభగ మండిపోతున్నా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మాత్రం వెనక్కి తగ్గకుండా ప్రజలను కలుస్తున్నారు. జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వె జగనన్న కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని అడిగి తెలుసుకుంటున్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు శనివారం పలు గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి గుమ్మానికి జగనన్నే మా భవిష్యత్తు స్టిక్కర్‌లను అతికించారు. మునిసిపాలిటీలోని 34 వార్డుల్లోను ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు.

అత్తిలి: సంక్షేమమే ధ్యేయంగా, అవినీతికి తావులేకుండా సుపరిపాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలు మద్దతు పలుకుతున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆదేశాల మేరకు అత్తిలి 4వ వార్డులో శనివారం జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు రంభ సూరిబాబు, జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ బుడితి సుజన్‌కుమార్, నియోజకవర్గ కో కన్వీనర్ బొడ్డు ఆమోస్, ఇల్లూరి సంపతరావు, పొన్నమళ్ల సంపతరావు, దామిశెట్టి రాము, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు. మంచిలి గ్రామంలో జరిగిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం వైఎస్సార్‌సీపీ నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దారం శిరీషా, మాజీ ఎంపీటీసీ రాగిరెడ్డి రాజేంద్రప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పీవీ సత్యనారాయణ, గ్రామపార్టీ అధ్యక్షుడు రాంపండు, సీహెచ్ సత్యనారాయణ, శ్యాంబాబు, దారం చినబాబు, ఎస్ రమేష్, ఎం కృష్ణ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలో 'జగనే మా భవిష్యత్తు జగనన్నే మా నమ్మకం' కార్యక్రమం కొనసాగుతోంది. 32వ వార్డు ఇన్‌చార్జి మారిశెట్టి రమణ ఆధ్వర్యంలో గృహసారథులు, వలంటీర్లు, కన్వీనర్లు ఇంటింటికి వెళ్లి జగన్ అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. పార్టీ కన్వీనర్లు బద్దెల అనసూయదేవి, దివ్య, ప్రశాంతి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పెంటపాడు: మండలంలో మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉత్సాహంగా నాయకులు నిర్వహిస్తున్నారు. శనివారం అలంపురం, రావిపాడు సొసైటీల అధ్యక్షులు కొలనువాడ దత్తుడు, దేవ వెంకటరమణలు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. చిన్నం గణపతి, దెందుకూరి సూర్యనారాయణరాజు, కొలనువాడ సీతారామరాజు, పెనుమర్తి తాతారావు, కాశీ, కొలుకుల రమేష్, రాపాక కుమారి,పోసిపో దైవ సహాయం, కోటటిచుక్కల శ్రీను, సానా శ్రీను, గురిజా వెంకట్రావు తదితరులతో పాటు గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని చినతాడేపల్లి, కుంచనపల్లి గ్రామాల్లో శనివారం జగనన్న మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాలన పట్ల ప్రజల అభిప్రాయాన్ని సేకరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను చినతాడేపల్లి గ్రామ సర్పంచ్ పిచ్చికల రాజారావు, ఉప సర్పంచ్ చిట్టూరి కాశీవిశ్వనాథం, ఎల్.అగ్రహారం సచివాలయ కన్వీనర్ శీలంశెట్టి బాలాజీ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో దూలపల్లి సుమలత, నీలపాల రామన్న, కొత్తపల్లి అరుణ, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

ఎంపీపీ పానుకుమాటి శేషులత



తాడేపల్లిగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషులత

తాడేపల్లిగూడెం రూరల్: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని మండల పరిషత్ అధ్యక్షురాలు పానుకుమాటి శేషులత అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ శేషులత అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో పెండింగ్‌లో ఉన్న జగనన్న ఇళ్లు, సచివాలయ, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్, ఆర్‌బీకేలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం ఆమె వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ శాఖపై తహసీల్దార్ వైకేవీ.అప్పారావు మాట్లాడుతూ మండలంలో 25 లక్షల సంచులు అవసరం ఉందన్నారు. గతంలో ఎనిమిది లక్షలు మాత్రమే ఉండేదన్నారు. రైతులు కొనుగోలు చేసుకుంటే వారికి ప్రభుత్వం నుంచి సొమ్ములు వారి ఖాతాలకు జమ అవుతాయన్నారు. ప్రస్తుత సీజన్‌కు 85వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. మండలంలో మే నెలాఖరు నాటికి రీ-సర్వే పూర్తి చేయవలసి ఉందని, రైతులు సహకరించాలని కోరారు. గ్రామాల్లో దేవాలయాల నిర్మాణానికి ప్రభుత్వ భూములను వినియోగించరాదని, సొంతంగా స్థలం సమకూర్చుకోవాలన్నారు. వ్యవసాయ శాఖపై ఏడీఏ పి.మురళీకృష్ణ మాట్లాడుతూ దాళ్వా సీజన్‌కు సంబంధించి మండలంలో 25 వేల ఎకరాల్లో 1.11లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడులు వచ్చాయన్నారు. గతంలో ఎకరాకు 75 సంచులు ఇచ్చే వారని, ప్రస్తుతం 110 సంచులు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. కోతలు పూరైన రైతులు మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆరుతడి పంటగా పిల్లిపెసర, జీలుగ వంటివి సాగు చేసుకోవాలని సూచించారు. విత్తనాలు అవసరమైన రైతులు ఆర్‌బీకేలను సంప్రదించాలన్నారు. మండలంలోని మూడు డ్రోన్ యూనిట్లు మంజూరయ్యాయన్నారు. వీటిని 50 శాతం సబ్సిడీపై అందించనున్నట్లు తెలిపారు. పంటల బీమాపై నవాబుపాలెం సొసైటీ అధ్యక్షుడు జద్దు హరిబాబు మాట్లాడుతూ 2021 సంవత్సరానికి సంబంధించి సొసైటీ పరిధిలో కొతమంది రైతులకు బీమా పెండింగ్‌లో ఉందని, వాటిని త్వరితగతిన అందేలా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కట్టా రంగబాబు, సూర్నని రామకృష్ణ, ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వీఎస్.వేణుగోపాల్, హౌసింగ్ డీఈ కేవీవీఎస్.ప్రసాద్, ఏపీవో ఏవీవీఎస్‌వీ.ప్రసాద్, డాక్టర్ శైలజ, సర్పంచ్‌లు, ఎమ్పీటీసీలు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు ప్రశాంతం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో శనివారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. తాడేపల్లిగూడెం టౌన్, రూరల్ మండలం, పెంటపాడు పరిధిలో పదిహేడు ప్రభుత్వ, జెడ్పీ, మునిసిపల్, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలో సోషల్ పరీక్ష జరగగా 3,386 మందికిగాను 3,315 మంది హాజరైయారు. 71 మంది హాజరు కాలేదు.

ఎంబీఆర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం



పెంటపాడు ముస్లిం షాధీఖానా వద్ద రంజాన్ తోఫా సరుకులు పంపిణీ చేస్తున్న కొట్టు విశాల్

పెంటపాడు: పట్టణంలో ఎంబీఆర్ ఫౌండేషన్ ద్వారా అన్ని వర్గాల పేదలకు చేస్తున్న సేవలు అభినందనీయమని యువనేత కొట్టు విశాల్ పేర్కొన్నారు. పెంటపాడు పంచాయతీ కార్యాలయం వద్ద ఎంబీఆర్ ఫౌండేషన్ తరఫున సంస్థ అధ్యక్షుడు కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి ద్వారా సుమారు 83 మంది పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ పురస్కరించుకొని నిత్యావసరాలు, కూరగాయలు, బియ్యం కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ఎంబీఆర్ సేవాట్రస్టు ద్వారా చేస్తున్న పలు కార్యక్రమాల పట్ల ఆయన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉభయగోదావరి జిల్లాల రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ద్వారంపూడి వేణుగోపాలరెడ్డి, సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఎంపీపీ దాసరి హైమావతి, ఏఎంసీ వైస్ చైర్మన్ జామి కృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి విజయానందరెడ్డి, కర్రి వరహాలరెడ్డి ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు పార్టీ యూత్ అధ్యక్షులు కొవ్వూరి భాస్కరరెడ్డి, బర్ల జయరాంబాబు, రెడ్డి శ్రీను, ముస్లీం సంఘ నాయకులు షేక్ అబ్దుల్లా, కోఆప్షన్ సభ్యురాలు చాంద్‌బీ, కర్రి పృధ్వీకుమార్‌రెడ్డి, ముస్లీం మతపెద్దలు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న సలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్, తదితరులు

పెంటపాడు: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్, జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కై గాల శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు దాళ్వా పూర్తయ్యే వరకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా సభ్యులు నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ కృషిచేయడం అభినందనీయమన్నారు. ఎంపీపీ దాసరి హైమావతి, తహసీల్దార్ జీవీ శేషగిరిరావు మాట్లాడుతూ రాబోయే ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం సేకరణ సక్రమంగా జరిగేలా సమిష్టి కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో సారథి, సభ్యులు నల్లమిల్లి విజయానందరెడ్డి, కునుకు పుల్లయ్య, గుండుమోగుల మునీంద్ర, బుద్దన చంటి, తాడి బాస్కరరావు, నాగేశ్వరరావు తదితర వ్యవసాయ సలహామండలి సభ్యులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన అవసరం



అత్తిలి బస్‌స్టేషన్‌లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ రాజంరాజు



తణుకు బస్టాండు ఆవరణలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న ఫైర్ సిబ్బంది

అత్తిలి: జాగ్రత్తలను పాటిస్తే అగ్నిప్రమాదాలను నివారించవచ్చని అగ్నిమాపక అధికారి సీహెచ్ రాజంరాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం అత్తిలి బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్, షాపింగ్‌మాల్ వద్ద అగ్నిప్రమాదాల నివారణపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈసందర్భంగా ఫైర్ ఆఫీసర్ రాజంరాజు మాట్లాడుతూ ఇళ్లలో గ్యాస్‌పై వంట పూర్తైన వెంటనే రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలన్నారు. ఒకే ప్లగ్‌పై ఓవర్‌లోడు వేయరాదని, విద్యుత్ ప్రమాదాల నివారణకు గాను అత్యాధునిక ఎంసీబీలను ఏర్పాటు చేయాలని సూచించారు. వంటగదుల్లో కిరోసిన్, డీజిల్, పెట్రోల్, అదనపు గ్యాస్ సిలిండరు వంటివి ఉంచరాదని తెలిపారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని ఏవిధంగా ఆర్పవచ్చునో ప్రజలకు అగ్నిమాపక పరికరాలతో ప్రదర్శన చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, రైల్వేసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తణుకు: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తణుకు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఐ.అజయ్‌కుమార్ అన్నారు. తణుకు అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో శనివారం తణుకు ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు వేగంగా స్పందించడంతో పాటు మంటలను ఎలా అదుపు చేయాలనే విషయ పరిజ్ఞానం ఉండాలన్నారు. ముఖ్యంగా వంటగదుల్లో మహిళలు సైతం అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తణుకు ఆర్టీసీ డిపో సిబ్బంది, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన రక్షణ మహోత్సవాలు

పెంటపాడు: గూడెం ఫెయిత్ చర్చి ఆవరణలో గత మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న 49వ వార్షిక రక్షణ మహోత్సవాలు శనివారం ముగిసాయి. ఈ సందర్భంగా శనివారం రాత్రి హైదరాబాద్‌కు చెందిన దైవప్రభోదకులు బ్రదర్ అనిల్ కుమార్ ముగింపు సమావేశంలో మాట్లాడుతూ ఆధ్యాత్మికంగా క్రీస్తుకు దగ్గరగా ఆయన బోధనల సారంగా జీవనం ఉండాలన్నారు. గత 49 ఏళ్లగా జ్యోతి ఆనంద్ ఆధ్వర్యంలో రక్షణ మహోత్సవాలు నిర్వహించడం గర్వకారణమన్నారు. చర్చి యూత్ సంఘ సభ్యులు, ఆర్కెస్ట్రా సభ్యులు సంగీత సహకారంతో ఆలపించిన కీర్తనలు అలరించాయి. పలు గ్రామాల నుంచి భారీ సంఖ్యలో విశ్వాసులు, బోధకులు హాజరయ్యారు.

అవాకులు చవాకులు పేలితే ఊరుకోం...!

తాడేపల్లిగూడెం రూరల్: స్థాయి మరిచి మంత్రిపై అవాకులు, చవాకులు పేలితే ఊరుకోమని జనసేన నాయకుడు బొలిశెట్టి శ్రీనివాస్‌నుద్దేశించి ఎంపీపీ పానుకుమాటి శేషులత అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శేషులత మాట్లాడుతూ మంత్రిని నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. ఆయను తిట్టే అర్హత నీకు లేదని హెచ్చరించారు. వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు శ్రమిస్తేనే ఎంపీగా 15వేల మెజార్టీతో గెలిచారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో సొసైటీ చైర్మన్‌లు జద్దు హరిబాబు, చిక్కాల సత్యనారాయణ, ఎమ్పీటీసీలు మార్లపూడి సుబ్బారావు, జంపెల్లి సత్యవతి, నార్ని నాగేశ్వరరావు, సర్పంచ్ ఎలిపే గాంధీ, నార్ని శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

వామపక్షాల ఆధ్వర్యంలో ప్రచారభేరి పాదయాత్ర

తణుకు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక, కార్పొరేట్ సంస్థల అనుకూల విధానాలను నిరసిస్తూ సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార భేరి పాదయాత్ర శనివారం తణుకులో కొనసాగించారు. స్థానిక రెండో వార్డులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పి.వి.ప్రతాప్, సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలపై మోయలేని భారాలు మోపుతోందని ఆరోపించారు. వామపక్ష పార్టీలకు చెందిన నాయకులు నామన వెంకటేశ్వరరావు, బొద్దాని కృష్ణకిశోర్, పుట్టా అమ్మిరాజు, కుడిపూడి వెంకటరెడ్డి, శారిపల్లి శ్రీను, కామన మునిస్వామి, రంగారావు పాల్గొన్నారు.